# బాధితులకు అండగా ఉండాలి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు కెంగర్ల మల్లయ్య



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ అక్టోబర్ 17: ఆర్జీ-2 ఏరియాలోని గతంలో 8ఏ గని ప్రమాద బాధితులను యాజమాన్యం ఆదుకోవాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య అన్నారు. 8ఏ గనిలో నిర్వహించిన 20వ సంతాప సభలో ఆయన అమరుల స్థూపానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ప్రకృతి విరుద్ధ స్థలాల్లో పని చేస్తూ మృత్యువుతో పోరాడుతూ దినదిన గండంగా గడుపుతున్న కార్మికుల పై యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై ఉన్న శ్రద్ధ గని కార్మికులు, వారి రక్షణపై ఏ మాత్రం చూపలేదని మండిపడ్డారు. సంస్థలో పని చేస్తూ మృతి చెందిన కార్మికుల త్యాగాలను అధికారులు విస్మరించడం వారి నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. గని ప్రమాదంలో 10మంది కార్మికులు మృతి చెందడంపై నాడు అనేక పోరాటాలు చేసి కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ వేయించడం జరిగిందని గుర్తు చేశారు. ఇందులో అధికారుల తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని తేలినప్పటికీ, ఏ ఒక్క అధికారిపై చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు గని ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, కొంగర రవీందర్, కొత్త సత్యనారాయణ రెడ్డి, బేతి చంద్రయ్య, ఆకుల రాజయ్య, కర్క శ్రీనివాస్ రెడ్డి, నాచగోని దశరథంగౌడ్, వివిధ యూనియన్ నాయకులు ఎల్. ప్రకాశ్, రాజారత్నం, ఉల్లి మొగిలి, దావు రమేశ్, వడ్డేపల్లి కుమారస్వామి, మార్కండేయ, లక్ష్మణ్ రావు, గుండేటి రాజేశ్, చక్రపాణి, మామిడి తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న మందమర్రి జీఎం మనోహర్

# కోలిండియా స్థాయిలో రాణించాలి

- మందమర్రి జీఎం మనోహర్

మందమర్రి, అక్టోబర్ 17: క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో పట్టు సాధించి కోలిండియా స్థాయిలో సింగరేణి కీర్తిని చాటాలని మందమర్రి ఏరియా జీఎం ఏ.మనోహర్ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ క్రీడా పోటీల్లో భాగంగా పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో షటిల్ బ్యాడ్మింటన్, సింగరేణి పాఠశాల ఆవరణలో టేబుల్ టెన్నీస్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను స్పూర్తిగా తీసుకోవాలన్నారు. క్రీడలతో శారీరకదారుఢ్యం, మానసికోల్లాసం కలగడంతో పాటు స్నేహభావం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఏరియా స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడా కారులు సింగరేణి స్థాయిలో రాణించి కోలిండియా పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. అక్కడ కూడా సత్తా చాటి ఏరియాకు గుర్తింపు తేవాలన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, సమన్వయ కర్త ఏ రవికుమార్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, మురహరి, చంద్రకుమార్, పిల్లి వెంకటేశ్వర్లు, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ-1లో కల్చరల్ మీట్ పోటీలు

గోదావరిఖని, అక్టోబర్ 17: ఆర్జీ-1 ఏరియాలో డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో ఆర్జీ-1,2 ఏరియాల కళాకారుల కల్చరల్ మీట్ పోటీలు ప్రారంభమయ్యాయి. టీటీసీ మేనేజర్ వెంకటరమణ హాజరై నటరాజ విగ్రహానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి పోటీలను ప్రారంభించారు. ఆర్జీ-1 నుంచి 24 మంది కళాకారులు, ఆర్జీ-2 నుంచి 27 మంది కళాకారులు పాల్గొన్నారు. సింగరేణి ఫోక్ డాన్స్, గజల్, కల్చరల్ డాన్స్, కూచిపూడి, భరత నాట్యం, కామిడి స్కిట్, కర్ణాటక సంగీతం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన బృందాన్ని కంపెనీ లెవల్ పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ కార్యదర్శి సారంగపాణి, రమేశ్, నరేందర్, రాజయ్య, కళాకారులు స్వామి, శంకర్, సుశీల, సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

## డిస్మిస్డ్ కార్మికులకు మరో అవకాశం

గోదావరిఖని, అక్టోబర్ 17: సింగరేణిలో విధులు నిర్వర్తిస్తూ 2019 జనవరి 1 నుంచి 31 డిసెంబర్ 2022 వరకు గైర్హాజరైన కారణంగా డిస్మిస్ అయిన కార్మికులకు యాజమాన్యం విధుల్లోకి తీసుకునేందుకు మరో అవకాశం కల్పించిందని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్ రావు, కే.వెంకటేశ్వర్లు తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు హై పవర్ కమిటీ నిర్వహించే రివ్యూ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో డిస్మిస్ కాలం నాటికి 46 ఏండ్లు, అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలనీ, కనీసం 100 మస్టర్లు కలిగి ఉండి బదిలీ వర్కర్, కేటగిరి-1గా తిరిగి నియామకం కోసం తగిన మెడికల్ అన్‌ఫిట్ కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బతుకమ్మ సంబురాల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, అక్టోబర్ 17: ఈనెల 22న స్థానిక రాణి రుద్రమాదేవి స్టేడియంలో నిర్వహించనున్న బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు పరిశీలించారు. మంగళవారం ఆయన సెంటినరీకాలనీలోని స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందునా, అన్ని వసతులు కల్పించాలని, ఉత్తమ బతుకమ్మల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సేఫ్టీ అధికారి వెంకటరమణ, డీజీఎం పద్మరాజు, పీఎం రవీందర్ రెడ్డి, ఎస్వో లక్ష్మీనారాయణ, డా.కల్యాణ్ చక్రవర్తి, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్ ఉన్నారు.

# పాత పద్ధతిలోనే కొనసాగించాలి

- సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్ సవరణలు తొలగించాలి
- సింగరేణి 11 ఏరియాల సివిల్ కాంట్రాక్టర్ల తీర్మానం



మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

రామగిరి, అక్టోబర్ 17: సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్-2023లో యాజమాన్యం ఇటీవల చేసిన సవరణలను తొలగించి పాత పద్ధతిలోనే కొనసాగించాలని సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు తీర్మానించారు. ఈ మేరకు ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలకు చెందిన సివిల్ కాంట్రాక్టర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా ఏరియాల అధ్యక్షులు మాట్లాడారు. యాజమాన్యం కొత్తగా చేసిన సవరణలు కాంట్రాక్టర్లకు నష్టదాయకంగా ఉన్నాయనీ, కొన్నేండ్లుగా సంస్థను నమ్ముకొని కాంట్రాక్టర్లుగా కొనసాగుతూ జీవనోపాధి పొందుతున్నామనీ, సంస్థ అప్పగించిన ఏ పనులైనా సమర్థవంతంగా పూర్తి చేస్తూ సహకరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం యాజమాన్యం కొత్తగా తీసుకవచ్చిన సవరణలను వెంటనే తొలగించి పాత పద్ధతినే పునరుద్ధరించేంత వరకు సివిల్ కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్లలో పాల్గొనవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఛలో కొత్తగూడెంకు ఆయా డివిజన్ల నుంచి 101 మంది ప్రతినిధులతో వెళ్లి కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి యాజమాన్యానికి తమ సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుకుల మొండయ్య, ముఖ్య సలహాదారు పీటీ స్వామి, ఆర్జీ-3 అధ్యక్షులు రాంచందర్, తొట్ల తిరుపతి యాదవ్, ఆర్జీ-2 అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మల్లయ్య, ఆర్జీ-1 ఉపాధ్యక్షులు సదానందం, నరేందర్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు పీ.సంపత్‌కుమార్, రాంరెడ్డి, గోలేటి అధ్యక్షులు గోపిరెడ్డితో పాటు సివిల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

**తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను మందమర్రి ఏరియా జీఎం కార్యాలయం ఆవరణలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళా ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో బతుకమ్మలను ఉంచి ఆడి పాడారు. జీఎం మనోహర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ్మ బతుకమ్మలకు బహుమతులను అందజేశారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.**

-మందమర్రి, అక్టోబర్ 17

# కన్ను పడితే కబ్జానే!

- కాప్రాలో 61.34 ఎకరాల స్థలం హాంఫట్
- 706 కుటుంబాల గోస పెడుతున్న ప్రేంసాగర్‌రావు
- ప్లాట్లు ఇవ్వకుండా 22 ఏండ్లుగా ఇబ్బందులు
- న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని బాధితుల ప్రెస్‌మీట్

మంచిర్యాల, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జీహెచ్ఎంసీ కాప్రా మున్సిపల్ సర్కిల్ దగ్గరలో సర్వే నంబర్లు 639/1, 648/1, 644/1, 647/ 1, 648 అండ్ 654లో శంషాబాద్ కిష్టయ్య అండ్ ఫ్యామిలీకి చెందిన 61.34 ఎకరాల భూమి ఉంది. 1982లో ఆ భూమిని ప్లాట్లు చేయడంతో 1982 నుంచి వివిధ గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్లలో పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులు, ఇతరులు 706 మంది కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారు.

**పీసీసీ మెంబర్‌గా ఉన్నప్పుడే..**

కొన్ని రోజులు అంతా బాగానే ఉన్నా.. ప్రేమ్‌సాగర్‌రావు కాంగ్రెస్ పార్టీలో పీసీసీ మెంబర్‌గా, పీసీసీ సెక్రటరీగా ఉన్న సమయంలో ఈ మొత్తం భూమిని కబ్జా చేసినట్లు బాధితులు చెప్తున్నారు. అప్పటి నుంచి ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా, ఎంత కొట్లాడినా ఆయనకు ఉన్న పలుకుబడి కారణంగా ఏం చేయలేకపోయామని వాపోయారు. హైకోర్టు జడ్జిమెంట్‌ను ఆయన పట్టించుకోవడం లేదంటున్నారు. చివరకు ధైర్యం చేసి 50 మంది ఇండ్లు కూడా కట్టుకున్నామని, కానీ.. గడిచిన రెండేళ్లుగా కట్టుకున్న ఇండ్లను ఆయన కూలగొట్టిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ, సోనియాగాంధీకి మెయిల్ ద్వారా చెప్పామని, రేవంత్‌రెడ్డి, మల్లికార్జున ఖర్గే దృష్టికి కూడా తీసుకెళ్లాం. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదంటూ వాపోయారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆ ప్లాట్‌లోనే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మా 706 కుటుంబాల ఉసురు పోసుకుంటున్న పీఎస్ఆర్ మట్టికొట్టుకు పోతారని మండిపడ్డారు. అలాంటాయనకు మంచార్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో తాము మీడియా ముందుకు వచ్చామని చెప్పారు. అంతా కలిసి వెళ్లి మంచిర్యాలలో ప్రేమ్‌సాగర్‌రావుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. మొత్తానికి మంచిర్యాలలో గ్రహపాటునో, పొరపాటునో ప్రేమ్‌సాగర్‌రావును గెలిపిస్తే గుండా రాజ్యం, రౌడీ రాజ్యం వస్తుందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఈ వ్యవహారం బలం చేకూర్చింది.

**నన్ను చంపేందుకు ప్రయత్నించారు..**

నేను కష్టపడి సంపాదించుకున్న డబ్బులతో కాప్రాలో ప్లాట్ కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నా. ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు కానీ పీఎస్ఆర్ 2002 నుంచి మమ్ముల్ని ఇబ్బంది పెడుతున్నడు. ఇటీవల నేను కట్టుకున్న ఇంటిని కూల గొట్టించిండు. న్యాయం అడిగేందుకు పోతే నాపై దాడి చేయించారు. నన్ను చంపాలని ప్రయత్నం చేశారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

**-గోపాల్‌రావు, జనరల్ సెక్రటరీ దళిత బహుజన ప్లాట్స్ ఓనర్స్ సంఘం**